క్లుప్తంగా

రూ.17.16 కోట్ల నిధులు మంజూరు

సింగరాయకొండ: నియోజకవర్గానికి ఉపాధి హామీ పథకం కింద పలు అభివృద్ధి పనులకు రూ.17.16 కోట్ల నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ డీఈ రవిబాబు తెలిపారు. కొండపిలో 16 పనులకు రూ.2.94 కోట్లు, మర్రిపూడిలో 14 పనులకు రూ.2.80 కోట్లు, పొన్నలూరులో 15 పనులకు రూ.2.45 కోట్లు, సింగరాయకొండలో 15 పనులకు రూ.3.07 కోట్లు, టంగుటూరులో 13 పనులకు రూ.2.75 కోట్లు, జరుగుమల్లిలో 17 పనులకు రూ.3.15 కోట్లు రూపాయల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు.

581 బేళ్లు కొనుగోలు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సూర, ముక్కకు సంబంధించి గురువారం నిర్వహించిన వేలంలో 581 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. చతుకుపాడు, కె.అగ్రహారం, మూగచింతల, గుర్రప్పడియ, నెన్నూరుపాడు, నేతివారిపాలెం, రామచంద్రాపురం, కట్టావారిపాలెం, నర్సింగోలు, అనకర్లపూడి, పెరిదేపి, మిట్టపాలెం, ముప్పరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 653 బేళ్ల వేలానికి తీసుకురాగా వ్యాపారులు 581 బేళ్లను కొనుగోలు చేసి 72 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.110, కనిష్ట ధర రూ.30, సరాసరి రూ.43.05గా నమోదైంది. 8 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు



కందిసాగును వివరిస్తున్న ఏఓ రాధ

పామూరు: కందిసాగులో రైతులు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఏఓ కంచం రాధ అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు ఎరువుల యాజమాన్యం గురించి, ప్రధాన పోషాకాలైన నత్రజని, యూరియా, పొటాష్ ఆవశ్యకత, మొక్కల్లో ఏఏ భాగాల పెరుగుదలకు ఏ పోషకాలు ఉపయోగపడతాయో సూచనలు ఇచ్చారు. కోటపాటి సంజీవరెడ్డి, పోతురాజు వెంకట్రావు, సైకం కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

ఉద్యమాలే పేదలకు అండ

కొండపి: ఉద్యమాలే పేద ప్రజలకు అండగా ఉంటాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల అంజినేయులు అన్నారు. సీపీఎం పెరిదేపి గ్రామస్థాయి శాఖ మసహాసలు ముప్పరాజు శేషయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పెరిదేపి గ్రామశాఖ కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శి కేజీ మస్తాన్, మల్లెల కొండయ్య, గుమ్మల వెంకటేశ్వర్లు, పెద్ద పేతురు, బ్రహ్మయ్య, సింగమ్మ, సుకన్య పాల్గొన్నారు.


టంగుటూరులో కుండపోత వర్షం



టంగుటూరు: భారీ వర్షంతో నిలిచిన నీరు

టంగుటూరు: టంగుటూరులో గురువారం కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి పోతుల చెంచయ్య కాలనీలోకి నీరు చేరడంతో కాలనీవాసులు ఇబ్బంది పడ్డారు. అదే విధంగా తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని ఉన్న జాతీయ రహదారి ఫ్లైఓవర్ నుంచి టంగుటూరు బొమ్మల సెంటర్ వరకు రోడ్డు గుంతలమయమై వర్షంనీరు చేరడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు. గుంతలో పడి పలువురికి గాయాలయ్యాయి.

హనుమంతునిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. హనుమంతునిపాడు, హాజీపురం, కొండారెడ్డిపల్లి, దొడ్డిచింతల, కిష్టంపల్లి, సీతారాంపురం, దాసరిపల్లి, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మండలంలో 8.4 వర్షపాతం నమోదైంది. వర్షంతో కుంటలు, చెక్‌డ్యాంలో నీరు చేరింది. వర్షం మినుము, అలసంద, వరి, వేరుశనగ సాగుకు అనుకూలం. వర్షంతో నీరు పోయకుండానే పొగనాట్లకు మంచి అదును ఇవ్వడంతో రైతన్నలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



హనుమంతునిపాడులో కురుస్తున్న వర్షం

గ్రామోత్సవం ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

పామూరు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈనెల 12వ తేదీన నిర్వహించే అమ్మవారి గ్రామోత్సవం, 13న నిర్వహించే వసంతోత్సవం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్సై టి.కిషోర్‌బాబు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో రాత్రి హిందు, ముస్లింలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. అందరూ ఐక్యంగా ఉండాలని, కవ్వింపు చర్యలకు పాల్పడవద్దన్నారు. నిబంధనలు పాటించి గ్రామోత్సవం నిర్వహించుకోవాలన్నారు.

మాటల్లో గొప్పలు.. ఆచరణలో తిప్పలు..!

- కూటమి ప్రభుత్వంలో అస్తవ్యవస్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ
- బియ్యం, చక్కెర పంపిణీతో సరి
- కందిపప్పు ఇవ్వకపోవడంతో పండగపూట పప్పన్నం లేనట్లే..?
- అరకొరగా సరఫరా చేసిన కేంద్రాల్లో డీలర్ల చేతివాటం



ఎండీయూ వాహనాల వద్ద రేషన్ సరుకులు తీసుకుంటున్న ప్రజలు

కనిగిరి రూరల్: కూటమి ప్రభుత్వంలో ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు పండుగ పూట పప్పు అన్నం కూడా కష్టమైంది. ఓ వైపు నిత్యవసర సరుకులు, కూరగాయలు నింగి నంటుతుండగా.. మరో వైపు పేద మధ్య తరగతి వర్గాల ప్రజలకు అండగా నిలిచే ప్రజా పంపిణీ వ్యవస్థలో కనీస రేషన్ అందడం లేదు. రేషన్ సరుకుల్లో కేవలం బియ్యం, చక్కెర ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. కొన్ని జిల్లాలో ఎఫ్‌సీఐ గోడౌన్‌లకు కందిపప్పు తొలినా.. పూర్తి స్థాయిలో అందకపోవడంతో ఇదే అదునుగా భావించిన రేషన్ డీలర్లు అసలు పంపిణీ పూర్తిగా ఎవ్వరికి పంపిణీ చేయకుండా స్వాహా చేస్తున్నారనే విమర్శలున్నాయి.

నియోజకవర్గంలో కేటాయింపు ఇలా..

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 75,942 రేషన్ కార్డులు ఉన్నాయి. కనిగిరి ఎఫ్‌సీఐ గోడౌన్ పరిధిలోని కనిగిరి, వెలిగండ్ల, పీసీపల్లి, హెచ్‌ఎంపాడు, మండలాల్లోని 101 రేషన్ షాపులకు 600 టన్నుల పీడీఎస్ బియ్యం(రేషన్ బియ్యం), 17 టన్నుల చక్కెర అలాట్ మెంట్ జరిగింది. కంది పప్పు సుమారు 55 టన్నులు రావాల్సి ఉండగా 22 టన్నులు మాత్రమే వచ్చినట్లు తెలిసింది. అంటే 40శాతం మాత్రమే అలాట్‌మెంట్ జరిగింది. అలాగే కనిగిరి పరిధిలోని పామూరు ఎఫ్‌సీఐ గోడౌన్ పరిధిలోని పామూరు 44, సీఎస్‌పురం 35 రేషన్ షాపులు కేవలం 17 టన్నులు మాత్రమే వచ్చింది. ఇంకా 30 టన్నుల వరకు కంది పప్పు రావాల్సి ఉంది.

ఆచరణలో అట్టర్ ఫ్లాప్..

ఎన్నికలకు ముందు రేషన్ దుకాణాలు పటిష్టం చేస్తామని చెప్పిన టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజా పంపిణీ వ్యవస్థపై శీతకన్ను వేశారు. ఉప్పు నుంచి పప్పు వరకు తక్కువ ధరకే నిత్యవసర సరుకులు అందచేస్తామని హామీలు గుప్పించి..అధికారంలోకి వచ్చిన తరువాత ఆ దిశగా అడుగులు వేయడం లేదు. షప్ దుకాణాల్లో బియ్యం, చక్కెర తప్పా.. మిగతా ఏ సరుకులు కూడా పూర్తి స్థాయిలో కార్డు దారులకు అందచేయడం లేదు. అధికారంలో వచ్చిన వెంటనే కందిపప్పు రాయితీపై పేద వర్గాలకు అందిస్తామని చెప్పిన చంద్రబాబుకు దానికి ఎగనామం పెట్టారు. పామాయిల్, గోధుమ పిండిల వాసనే లేదు. కందిపప్పును అరకొరకగా సరఫరా చేస్తూ మమ అనిపిస్తున్నారు. బయట మార్కెట్‌లో కిలో కంది పప్పు రూ. 160 పైనే పలుకుతోంది. రేషన్ దుకాణంలో అయితే రూ.67కే ఇస్తారు. దీంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు కిలో కంది పప్పుకు రూ 100 అదనంగా పెట్టి కొనలేకా.. కూరగాయల ధరలకు రెక్కలు రావడంతో వాటిని తినలేక. పచ్చడి మెతుకులతో సరిపెడుతున్నారు.

డీలర్ల చేతి వాటం..

ప్రభుత్వం చేస్తున్న నిర్వాహకం ఇటు డీలర్లకు, అటు గోడౌన్ నిర్వాహకులకు వరంగా మారింది. కొన్ని గోడౌన్ పాయింట్ల ఆలస్యంగా కంది పప్పును సరఫరా చేయగా.. మరికొన్ని చోట్లకు త్వరగా వచ్చినా కార్డులకు తగ్గట్టు అలాట్‌మెంట్ పంపలేదు. మరి కొన్ని గోడౌన్‌లలో రావాల్సింది వంద శాతం అయితే వచ్చింది 40 శాతం అంటూ డీలర్లకు చెప్పి పూర్తిగా ఇవ్వకుండా నిలిపివేశారు. దీంతో జిల్లాలో చాల చోట్ల అరకొరకగా అయినా కందిపప్పు పంపిణీ కాగా. మరి కొన్ని మండలాల్లో కనీసం పంపిణీకి నోచుకోలేదు. దీంతో డీలర్లు అందులో చేతి వాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


భూములు పరిశీలించిన ఆర్డీఓ



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఆర్డీఓ

మర్రిపూడి: స్థానిక ఫ్రీ ఓల్డ్ భూములను కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి గురువారం పరిశీలించి రిజిస్ట్రేషన్ చేసిన భూ యాజమాన్యదారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు మర్రిపూడి పరిధిలోని సర్వే నంబర్ 943–1లో భూమిని ఆయన పరిశీలించారు. తహసీల్దార్ జ్వాలా నర్సింహారావు, ఆర్ఐ రమణలతో కలిసి గ్రామాల్లో రిజిస్ట్రేషన్ చేసిన భూముల వాస్తవ పరిస్థితులను కార్యాలయంలోని రికార్డులతో సరిపోల్చి పరిశీలించారు. ఆయన వెంట బడే సాహెబ్ సర్వేయర్ వసుధ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

తిరుమలనాథస్వామికి సూర్యకిరణాభిషేకం



సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అయ్యలూరివారిపల్లె పంచాయతీ పరిధిలోని తిరుమలనాథ పుణ్యక్షేత్రంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి మూల విగ్రహ పాదాలను ఉదయం సూర్యకిరణాలు తాకాయి. ఈసందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా దసరా బ్రహ్మోత్సవాలు



వెంకటేశ్వర స్వామి ఆలయంలో కళ్యాణోత్సవాలు

కనిగిరి రూరల్: దసరా బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు వివిధ రూపాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి ప్రత్యేక పూజలు అందుకున్నారు. కనక దుర్గమ్మ గుడి, అంకాళమ్మ గుడి, శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, దొంతులమ్మ గుడి, సాయిబాబ గుడిలో, లక్ష్మీ నరసింహస్వామి, శివనగర్ కాలనీలోని దత్త పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక గార్లపేట రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు, కళ్యాణోత్సవాలు జరిగాయి. నందనమారెళ్లలో బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో చండీహోమం, రుద్రాభిషేకాలు చేశారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వర్లు

సీఎస్‌పురం(పామూరు): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. జరిగింది. ఈసందర్భంగా బోయమడుగుల ఎంపీటీసీ బైరెడ్డి తిరుపతి రెడ్డి, సర్పంచ్ బొట్లా చిరంజీవి, కోవిలంపాడు ఉపసర్పంచ్ టి.బాబు మాట్లాడుతూ ఉపాధి పనుల గ్రామసభలను సర్పంచ్, ఎంపీటీసీలకు సమాచారం లేకుండా నిర్వహిస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకుతీరాగా..ఏపీఓ వాక్యవతి స్పందిస్తూ పంచాయతీ కార్యదర్శుల అవగాహన లోపంతో ఇలా జరిగిందని, రెండో విడత సమావేశాలకు ముందస్తు సమాచారం ఇస్తామని చెప్పారు. స్వీపర్ మొదలుకుని ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏ, రేషన్‌డీలర్లవరకు అడ్డగోలుగా తొలగిస్తున్నారని గత ప్రభుత్వ హయాంలో ఇలా జరిగిందా అని ఎంపీటీసీ బైరెడ్డి తిరుపతి రెడ్డి ప్రశ్నించారు. చెన్నపునాయునిపల్లెలో ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఎందుకు పెట్టలేదని ఏపీఓను ప్రశ్నించగా నెలాఖరుకు అన్ని ఖాళీలను పూర్తిచేసి ఉపాధి పనులు ప్రారంభిస్తామన్నారు. బోయమడుగులకు 3 ఫేస్ విద్యుత్‌లైన్ పనులు ఎందుకు చేపట్టలేదని సమావేశం దృష్టికితేగా నిధుల లేమితో తాత్కాలికంగా పనులు నిలిపారని త్వరలో ప్రారంభిస్తారని ఇన్‌చార్జ్ ఏఈ జిలానీ తెలిపారు. ఉప్పలపాడులో నూతన స్తంభాలకు రూ.48 వేలు చెల్లించామని, ఇప్పటికీ స్తంభాలు వేయలేదని ఉప్పలపాడు సర్పంచ్ వై.ప్రవీణ్ సమావేశం దృష్టికితేగా త్వరలో స్తంభాలు వేయిస్తామన్నారు. రేగులచెలక, ఏకునాంపురంలో పాఠశాల గదులు శిథిలావస్థలో ప్రమాదకరంగా ఉన్నాయని, డీజీపేటలో జెడ్పీహెచ్‌ఎస్‌కు కొత్తభవనం నిర్మించాల్సి ఉందని సమావేశం దృష్టికితేగా ఎంఈఓ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వెంకటాయచెరువు, చెన్నపునాయునిపల్లెలో పాఠశాలల్లో ఎస్‌యంసీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని, ప్రభుత్వ పాఠశాలలో పేర్లు ఉన్న విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారించాలని ఎంపీపీ మూడమంచు ఎంఈఓ జె.ప్రసాదరావుకు సూచించారు. బోయమడుగుల, పిల్లిపల్లి గ్రామాల్లో జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, సర్పంచ్ చిరంజీవి సమావేశంలో చెప్పగా వైద్యశిబిరాలు నిర్వహిస్తామని డాక్టర్ మహేష్ తెలిపారు. 104 వాహన సేవలు అన్ని రోజుల్లో అందేలా చూడాలని ఎంపీపీ మూడమంచు డాక్టర్‌కు సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ షేక్.ఖాదర్‌బీ, డీటీ పి.వెంకటేశ్వర్లు, సీఎస్‌పురం సర్పంచ్ శ్రీరాం పద్మావతి, నరసయ్య, మితికాల ప్రభావతి, పాతర లలితమ్మ, ఏఓ కంచం రాధ, డాక్టర్ మునీర్, డాక్టర్ మహేష్, ఎంఈఓ ప్రసాదరావు, ఐసీడీఎస్ సామ్యేలు, ఏపీఎం లక్ష్మీనారాయణ, పీఆర్‌ఏఈ బ్రహ్మయ్య, ఇరిగేషన్ ఏఈ జి.వినయ్, హౌసింగ్ ఏఈ హరికృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వెలిగొండ మలిదశ ఉద్యమానికి శ్రీకారం

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

కనిగిరి రూరల్: జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం మలిదశ ఉద్యమానికి శ్రీకారం చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. స్థానిక దర్శి చెంచయ్య భవన్‌లో గురువారం నియోజకవర్గ స్థాయి సమావేశం జీపీ రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని 11 ముంపు ప్రాంత గ్రామాలకు ఆర్‌ఆర్ ప్యాకేజీ అందజేయాలని, ప్రాజెక్టుకు నికరజలాలు కేటాయించాలని, దీనిపై దశల వారీ ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. నవంబర్ 18వ తేదీన వెలిగొండ సాధనకు కలెక్టరేట్ వద్ద జరిగే భారీ ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ 100 ఏళ్ల ఆవిర్భావాన్ని పురస్కరించుకొని నియోజకవర్గాలు, మండలాల్లో జెండా ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్, ఎస్‌డీ మౌలాలి మాట్లాడుతూ అన్ని మండలాల్లో, గ్రామాల్లో కమ్యూనిస్టు పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు సమష్టి ప్రణాళికతో ముందడగు వేద్దామన్నారు. పార్టీ 100 ఏళ్ల ఆవిర్భావ వేడుకలను నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పోతల ప్రభాకర్, సుబ్బారావు, పందిటి మోహన్, గుజ్జుల బాలిరెడ్డి జడ బాలకోటయ్య, సయ్యద్ షరీఫ్, జయంపు కోటయ్య, ఖాసీం వలి, పుట్టా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నృసింహస్వామి ఆలయ ఆర్చీ పరిశీలన



లక్ష్మీనృసింహస్వామి ఆర్చీ పనులు పరిశీలిస్తున్న ఈఈ

మర్రిపూడి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ పృధులగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి వెళ్లే రహదారి ముఖద్వారానికి ఏర్పాటుచేయనున్న ఆర్చీని పంచాయతీరాజ్ ఈఈ వై కోటేశ్వరరావు గురువారం పరిశీలించారు. స్వామిని దర్శించుకున్న అనంతరం పృధులగిరి కొండపై లక్ష్మీనృసింహస్వామి మెట్లు మార్గం నుంచి రెడ్ల అన్నదానం సత్రం వరకు రూ.50 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. మర్రిపూడి నుంచి యానాది కాలనీ వరకు రూ. 8 కోట్లతో తారురోడ్డునిర్మించామని, అయితే అటవీ అనుమతులు లేక నిలిచిన 1.2 కిలోమీటర్ రహదారికి అనుమతులు వచ్చాయన్నారు. త్వరలో పనులు చేపడతామన్నారు. ఆయన వెంట డీఈ సీహెచ్ శ్రీధర్‌రెడ్డి, ఏఈ జాలయ్య ఉన్నారు.

రైతులకు త్వరితగతిన పరిహారానికి చర్యలు



తహశీల్దార్‌తో చర్చిస్తున్న ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి

సీఎస్‌పురం(పామూరు): బెంగుళూరు, కడప, విజయవాడ (బికెవి) గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌హైవే, మైదుకూరు, సింగరాయకొండ 167బీ జాతీయ రహదారిలో భూములు కోల్పోయిన రైతులకు సంబంధించి పెండింగ్ క్లైమ్స్‌ను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయానికి గురువారం వచ్చిన ఆయన బీకేవి, 167బీ జాతీయ రహదారి పెండింగ్ క్లైమ్స్‌పై తహసీల్దార్ డి.మంజునాథరెడ్డితో చర్చించారు. మండలంలో ఫ్రీహోల్డ్ చేసిన భూముల రికార్డులు పరిశీలించారు. మండలంలోని పెదగోగులపల్లెలో చేసిన ఈక్రాఫ్‌ను సూపర్‌చెక్ చేశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ పి.వెంకటేశ్వర్లు, ఏఓ కంచం రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యం

కనిగిరి రూరల్: మనిషికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ముఖ్యమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రతి మనిషికి జీవిత ప్రయాణంలో ఏదో ఒక వత్తిళ్లు ఉంటాయని ..దానిని అధిగమించేందుకు దురలవాట్లకు, చెడు వ్యసనాలకు బానిన కాకుడదని సూచించారు. వైద్యులు అబ్దుల్ కలాం శంద్రీష్‌లు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యనికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను గూర్చి వివరించారు. హెడ్ నర్సు మునీంద్రమ్మ, వివిధ సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్, శ్యామ్యూల్ గెర్షోమ్, నవకుమార్ పాల్గొన్నారు.

సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు



చండీ హోమ పూజల్లో భక్తులు

కనిగిరి రూరల్: స్థానిక షిర్డీ సాయి బాబా దేవస్థానంలో 106 మహా సమాధి(పుణ్య తిధి) విజయ దశమి పురస్కరించుకుని గురువారం విశిష్ట పూజలు నిర్వహించారు. దుర్గాష్టమి సందర్భంగా స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ చక్ర సహిత చండీహోమం, పూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మారావు, వీసీ రామశాస్త్రి, ఈర్ల గురవయ్య, ఏసీ చెంచులు తదితరులు పాల్గొన్నారు.

శరణు శరణు దుర్గమ్మ..!



బైరవకోనలో మహిషాసుర మర్ధినిగా త్రిముఖ దుర్గాదేవి



సింగరాయకొండలో దుర్గాదేవి అలంకరణలో పోలేరమ్మ తల్లి



మర్రిపూడిలో దుర్గాదేవి అలంకరణలో..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గురువారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



పామూరు: మహిషాసుర మర్ధని అలంకారంలో..



నాగిరెడ్డిపాలెంలో దుర్గాదేవి అలంకరణలో..



టంగుటూరు: ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ



వల్లూరులో దుర్గాదేవిగా వల్లూరమ్మ..



కె. ఉప్పలపాడు దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు